

# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2015

సంపుటి : 21 **239** సంచిక : 1



## 2014 సం॥ము కలహాల కాపురమైంది! 2015 సంవత్సరం కలిమి చెలిమిలు కూరుస్తుందా!

### మారింది వత్సరకాలం! మారుట దానికి సహజం
### ఉదయాస్తములూ! పవలూ రేయీ! నెలలు ఋతువులు! వత్సరములుగా దొరలు నీ కాలం!!

పవలూ రేయి, వెల్తురు చీకటి! ఎండావానా! వత్సర వత్సరములుగా కాలం దొరలిపోతుంది. క్షణక్షణమూ! భువిలోని కణ కణమూ మారిపోతూనే ఉంటుంది. దేహంలోని ప్రతీ అవయవమూ మార్పు చెందుతూనే ఉంటుంది. దేశంలో సెకను సెకనుకూ మార్పు వస్తూనే ఉంటుంది.

కాలం ఆగదు! ఎవరికోసమూ ఆగదు! ముందుకుపోతూనే ఉంటుంది! మండువేసవియని నిలువదు! ముసురుక్రమ్మి జడివాన కురుస్తుందని వెరవదు. తూరుపు దిశకు సూర్యుడు వచ్చినతోడనే కిరణములు వెల్తురు కురుపిస్తాయ్; ఆయన పన్నెండు గంటలుద్యోగముచేసి పడమర దిశకేగిన తోడనే, ఆయన వెంటే వెలుగూ వెళ్ళిపోతుంది? చిక్కటి చీకటి అలుముకుంటుంది? రాత్రివేళ చంద్రుడు తనపనిలోకి వస్తాడు. అంత వెలుగునీయలేడు. అమావాస్యనాడు పూర్తిగా సెలవుతీసుకుంటాడు.

ఉదయాస్తములందు వెల్తురు రేకులను వెదజల్లిన సూర్యుడు మరుసటి రోజు ఉదయమున వస్తూ, పంచాంగ పట్టికలోని ఓ రోజును దొర్లింపచేస్తాడు. ఇలా ఉదయాస్తములుతో పవలూరేయిల్లా రోజులు గడచిపోతుంటాయి.

'ఉదయాస్తములూ! పవలూరేయీ! నెలలు ఋతువులు! వత్సరములుగా దొరలుపోవురా కాలము' అన్నమాట సత్యమగుచున్నది. మోడులు చిగురించునురా! బోసి చన్న భువి పులకరించురా! బంగరు పంటలు తాండవించురా! అనిన సినిమాకవి పలుకులు సత్యములు కావడం లేదు. కావాలని ఏడుకొండలవాణ్ణి ప్రార్థించవలసి వస్తుందేమోననిపిస్తుంది.

మోడులు చిగురించుననడానికి చెట్లూ మొక్కలూ ఉండాలి. బంగరు పంటలు తాండవించుననడానికి వరిపైరుల్ను పండించే పంటచేలు ఉండాలి. చేలు పండాలంటే చేలకు నీటి వసతి ఉండాలి, వరినారు నాటాలి. పంటలు పండించే దేశం మనది. మనలో 99 శాతం మంది వరి అన్నమునే తింటున్నారు. మన తెలుగు బాలలు పాడే పాటనుదహరించుతున్నాను:

**వానల్లు కురవాలి; వరిచేలు పండాలి!**

**మా అమ్మ వండాలి! మా కడుపు నిండాలి!**

అంటూ నీటి జల్లుల్లో ఆడుతూ ఆనందం పొందుతారు. ప్రాణులన్నీ అన్నం లేకుండా జీవించలేవు – అన్నాడు గీతాచార్యుడు. అన్నం నుంచే ప్రాణులు పుట్టాయన్నాడు.

**అన్నాద్భవంతి భూతాని**
**పర్జన్యా ధాన్య సంభవః।**
**యజ్ఞాద్భతి పర్జన్యో**
**యజ్ఞకర్మ సముద్భవః–**

–ప్రాణులన్నీ అన్నమునుండే పుడుతున్నాయి. అన్నం తినే జీవిస్తున్నాయి. ఆ అన్నత్పోత్తి వర్షములు కారణంగా జరుగుతుంది. ఆ వర్షములు కావాలంటే యజ్ఞములు చేయాలన్నారు. యజ్ఞాల్లోని ధూమమునకు సముద్రంలోని ఆవిరి తోడవుతుంది. ఆ ధూమము మేఘమై, వాయుచలనంతో వర్షధారల్ని వర్షింప చేస్తుంది. చెట్లు కారణంగా గాలులు, గాలులు కారణంగా సాగరంలో ఎగసిన అలలు, వాటి కారణంగా మేఘములుత్పన్నమై వర్షం కురుస్తుంది. వరిచేలు పండుతాయ్.

చెట్లు చేమరములు కొట్టేసి, నేల చదునుచేసిన యెడల వర్షం కురవదు. భూమి ఎడారిగా మారుతుంది. నీటి కరువు యేర్పడుతుంది. భూజలం పాతాళానికి అడుగంటుతుంది. ఉష్ణం పెరగడం వలన సకలప్రాణులూ బాధింప బడతాయ్. మానవునిలోని ప్రశాంతతకు భంగం వాటిల్లుతుంది. వీటన్నిటినీ సాలోచన చేసిన పెద్దలు ఒక చక్కని విజ్ఞాన సూచన చేసారు.

శ్రేష్టుల సాంగత్యము చేస్తూ వినయ విమల విధేయతల నలవరచుకోమన్నారు. నిబద్ధతకల జీవితాన్ని రచన చేసుకోమన్నారు. నాలుగు మంచి విషయాలందాసక్తిని పెంచుకోమన్నారు.

**హస్తస్య భూషణం దానం**
**కంఠస్య భూషణం సత్యం**
**శ్రోతస్య భూషణం శాస్త్రం**
**మిత్రస్య భూషణం స్నేహం**

– జయనామ సం॥ములో కలిగిన ఈతి బాధలు, నినాదములూ, వివాదములూ, విడిబాటులు పైనాలుగు గుణాల లేమివల్లనే కలిగాయ్. మనసును అన్యధా పోనీయరాదు.


2014 సం॥వత్సర మత్సరాలను అప్పుడే చెరిపేసుకోగలం; 2015 సంవత్సర ఆనందాన్ని పొందగలం!



బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



### శృంగేరి శంకరపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతీ తీర్థమహాస్వామి చరణుల అనుగ్రహభాషణం

# మంచిని చేస్తూనే ఉండండి

మానవునికి తన జీవితంలో ఎప్పుడూ మంచే జరుగుతుండాలని కోరిక కలగటం సహజం, న్యాయం కూడాను. అందువలన ఎన్నో కర్మలు జరుగుతున్నాయి. వాటి ఫలితాలను మానవుడు జన్మజన్మలలో అనుభవిస్తూనే ఉన్నాడు. జ్ఞానోదయం అయ్యేవరకు అనుభవిస్తూనే ఉంటాడు. కాని కొందరికి సందేహం కలుగుతుంటుంది. "మేము చాల సత్కర్మలను ఆచరిస్తున్నాం. అవి సత్ఫలితాలను నిస్తాయా?" అని. అన్ని కర్మలకు ఫలితములుంటాయి!! సత్కర్మలకు సత్ఫలితాలు, దుష్కర్మలకు దుష్ఫలితాలు వస్తాయి. అందులో ఎటువంటి సందేహం ఉండవలసిన పనిలేదు అని శాస్త్రాలు చెప్తున్నాయి. "సత్కర్మల నాచరిస్తూ ఉండండి మీకు సత్ఫలితాలను ఈ లోకంలోనే కాదు పరలోకంలోనూ అనుభవించవచ్చు".

'యథా ధేను సహస్రేషు వత్సో విన్దతి మాతరమ్।
తథా పూర్వకృతం కర్మకర్తారమనుగచ్ఛతి॥'

వేల ఆవుల మందలో కూడా దూడ తన తల్లిని పోల్చుకోగలదు. అలాగే మానవుని కర్మలు అతనిని అనుసరించి ఫలితాల నందజేస్తాయి. అందువలన దుష్కర్మలు తమ ప్రభావాన్ని చూపించి సత్కర్మలు నిష్ప్రయోజనకారులేమోనని ఎవరూ సందేహించవలసిన పనిలేదు. ఆ మాటకొస్తే సత్కర్మల ఫలితాలు వేగంగానే కనపడతాయి.

**'కుశలాన్యాశు సిధ్యన్తి నేతరాణి కృతాని యత్।'**

దుష్కర్మలు దుష్ఫలితాలను నెమ్మదినెమ్మదిగా యిస్తూ చివరికి కర్తను పూర్తిగా నాశనం చేస్తాయి. ఈ విషయాలను అర్థం చేసుకొని, అందరూ సత్కర్మలనే ఆచరిస్తూండాలని మేము ఆశీర్వదిస్తున్నాము. ●




# ప్రముఖాంధ్ర 21వ సం॥ పుష్పాంజలి!

*తెలుగు భాషా, సంస్కృతీ సాహితీ వైభవాన్ని సనాతన ధర్మంతో ముడివేసి – తెలుగువారు విడిచివెళ్ళిన చెన్నయ్‌లో ప్రారంభించిన 'ప్రముఖాంధ్ర' 21వ సం॥ము వెలుగు చూడడం ఎందరో గురువర్యుల ఆశీస్సులు – శ్రీ వేంకట ప్రభు అనుగ్రహం, శ్రీవాణి ఆశీస్సులూ కారణం. ప్రకటనలతోను, విరాళములతోనూ, నా ముగ్గురు కుమారులు వేంకటేశ్వరరావు, నారాయణరావు, నాగసాయిప్రసాదుల చేదోడుతోనే ఇరవై ఒక్క సంవత్సరాల ప్రాయానికి వచ్చింది. వారందరికీ నా అభినందనములు. ద్రవ్య సహాయం చేసిన పీఠాధిపతులకు, వాణిజ్యాధిపతులకు వినయాంజలి. కృతఃపూర్వక మనంతో సమర్పిస్తున్నాను. – మీరు లేకపోతే నేను లేను, భాషా సేవ చేయలేను! మీకూ, భారత భారతికీ పునః పునః వందనములు– జై తెలుగుతల్లీ!*




అనంత పద్మనాభా స్వామీ! అనంత ఐశ్వర్య ప్రదాతా!!
లక్షల కోట్ల వెలుగుచూసినందుకు కాదు
కోటి ప్రభలతో నీ రూపు కళ్లముందు నిల్పి నిల్చినందుకు
పరవశంగా వుంది! పట్టలేని ఆనందంగా ఉంది!
ఆశ్చర్యమన్నది నీ ఆకారాన్ని దర్శించు నిండురూపంలో ఉంది!
నీ స్వర్ణకాంతిలో ఏదో సమాశ్వాస ఉంది! సంతోషం నిండిన సంభ్రమముంది
విశాలవిశ్వాన్ని తాకే విభ్రమముంది!
నిలువెత్తు మూర్తిలో గోవిందనామం వినిపిస్తుంటుంది
నీ రూపం చూస్తూ వుంటే శరీరమే ఆనంద భాష్యమైపోతుంది!
నక్షత్రాలు, నవ్వులు, పూలు, సీతాకోకచిలకలు
కలగలిసిన కళాకాంతులు నీలో కళకళలాడుతాయి!
అన్నమయ్య సంగీత రంగులు పులుముకున్నట్లున్నావు
పవిత్రతకు నువ్వు ప్రత్యక్ష సాక్షివి! ప్రతిభకు నువ్వు పరకాష్టవి!
రాగద్వేషాలకు అతితీమైన రాగమేదో నాలో కదులుతూ
వైరాగ్యమంటని వైభవమేదో పూరిస్తుంది!
నీలో తల్లి కనిపిస్తుంది తండ్రికనిపిస్తున్నాడు
నిన్ను చూస్తే వలపు కలసిన వయ్యారమేదో పిలుస్తున్నట్లుంటుంది.
పరుగులు పెట్టే ప్రపంచాన్ని అవలోకిస్తున్నట్లుంటావు
ఆరాటం నిండిన లోకాన్ని చిరునవ్వుతో చూస్తున్నట్టుంటావు
స్వామీ నువ్వు సంక్షిప్త విశ్వంలా వున్నావు!
అనంత కాల భారతీయ ఆధ్యాత్మిక ఆనంద ఆకారం దాల్చినట్లున్నావు
సౌకుమార్యాన్ని బంగారంలో రంగరించినట్లున్నావు
అంగరంగ వైభోగంతో అలరారుతున్నావు
మానవాతీత మహిమల్లో మరులు గొల్పుతున్నావు
విలాసంగా నిలుచుని ఉన్నావు! కులాసాగా వున్నావు
ప్రాణ స్పందనతో వున్న ఆదిశేషుడి పగడాలపై వున్నావు
వజ్రాల ధగధగల్తో దిగ్భ్రమ కలిగిస్తున్నావు
పాలకడలిలో వుండాల్సిన వాడివి ఏడుగిరులపై ఉన్నావు స్వామీ!
ఆకాశం నీకు తలవంచింది; భూమిపై నున్న గిరులు నీకు పాన్పయినవి
కన్నార్పకుండా లోకం నీకు కైమోడ్చి చూస్తోంది.
అనంతలోకాల కావల వున్నవాడివి! అందటి మధ్యకూ వచ్చావు
నీ మనోహర రూపం చూసి భ్రాంతులు భస్మమయ్యాయి
ప్రముఖాంధ్రను ప్రపంచదేశాల్లోని తెలుగువారినందర్నీ
అలరించాలని ఇరవై ఒకటో సంవత్సరంలోకి ప్రవేశింప చేసావు!
నీ కన్నా అధికులెవరున్నారయా! నిన్ను గాక ఎవరికి నమస్కరింతునయ్యా!



# నీలం సంజీవరెడ్డి పేరు తెలియని తెలుగువాడు తెలుగువాడే కాడు!



**విశ్వాసం లేనివాడు మనిషికాడు. మనిషిలో గల కృతజ్ఞతా భావం మృగ్యమైపోతుందని బాధపడేవారు నీలం సంజీవరెడ్డి. ఆయన 5 సంవత్సరాలు కారాగృహంలో ఉన్నారు. 5 సంవత్సరాలు రాష్ట్రపతి నిలయంలో బంగారు పంజరం జీవితం గడిపానన్నారు.**

పదవికి వన్నె తెచ్చినవాడూ, పదవిని త్యజించినవాడూ నీలం సంజీవరెడ్డే! పదవి లేకున్నా, ఉన్నా భరోసాగా నిలబడిన మేరు నగధీరుడు. త్యాగధనుడు, రాజనీతిజ్ఞుడు, రాయలసీమ నుంచీ రాజకీయాల్లోకి వచ్చి, నీతిమంతుడైన రాజకీయవేత్తగా నిలబడ్డాడు. ఆత్మ గౌరవం కోసం ఇందిరాగాంధీనే లెక్కచేయలేదు. పదవుల కోసం ప్రాకులాడనూ లేదు. ఆత్మపరిశోధనం చేసుకునేవాడు. తన అధీనంలోని శాఖవారు తప్పుచేసినా, తన తప్పిదమనుకుంటూ పదవులను త్యజించేవాడు. మూడు ప్రాంతాలూ కలిసి ఉన్న ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆయన. 1962 సం॥ములో బస్ రూట్లను జాతీయం చేసిన సందర్భములో తన బాధ్యత లేకున్ననూ ముఖ్యమంత్రి పదవిని త్యజించారు. ప్రధాని నెహ్రూ వద్దని వారించినా, ఆయన తన నిర్ణయాన్ని వీడలేదు.

మంత్రిగా ఉన్నప్పుడు తన శాఖలోని ఉద్యోగి తాగివచ్చినందుకు తన శాఖా మంత్రి పదవికి రాజీనామా చేసాడు. అవినీతి ఆరోపణలేవీ లేని ఆరోగ్యప్రదమైన రాజకీయ జీవితం గడిపిన దెవరూ అని ప్రశ్నించుకుంటే ప్రకాశం పంతులుగారి పేరు, తరువాత నీలం సంజీవరెడ్డి పేరే కనిపిస్తుంది. రాష్ట్ర రాజకీయాల్నుంచీ దేశరాజకీయాలకు ఎదిగినవాడూ నీలం సంజీవరెడ్డి. నెహ్రూ కుటుంబానికి తలవంచని మేరునగధీరుడూ సంజీవరెడ్డే! పోటీలేకుండా, పగవారి వగలు సోకకుండా రాష్ట్రపతిగా నెన్నుకోబడిన ఆంధ్ర మొనగాడు సంజీవరెడ్డి. ఆయన అనారోగ్యవాతబడినపుడు, దేశమంతా ఏకనినాదంతో ఆయన ఆరోగ్యనిమిత్తంగా ప్రార్ధనలు చేసిదంటే – ఆయనెంతగా ప్రజానురాగంలో మమేకమయ్యారనే విషయం తేటతెల్లంగాకపోదు.

రాష్ట్రపతి నిలయంలోని మూడే గదుల్లో 5 సం॥ములూ నీలం సంజీవరెడ్డి దంపతులు సాదాసీదా జీవితాన్ని గడిపారు. ఆయన రాష్ట్రపతి అయిన తరువాత కూడా ఆయన ధర్మపత్ని వండి వడ్డించి పెట్టేది – అంటే ఆయన సాదాసీదా జీవితం విదితమవుతుంది. రాష్ట్రపతిగా ఉన్నప్పుడుగానీ, రాష్ట్రపతి పదవి అనన్తరంగానీ ఆయన రాజకీయ ప్రస్తావనం చేయలేదు. మట్టిని పట్టిన రైతువలె జీవితం గడిపారు.

రైతుగా ప్రారంభించిన ఆయన జీవితం రైతుగానే గడచిపోయింది. రౌతుగా ఆయనెపుడూ అధికారం చేయలేదు. తనపై అధికారం అనుగ్రహించలేదు.

మే 19వ తేదీన ఆయన అనంతపురంలో జన్మించారు. విచిత్రమేమంటే 'మే' తరువాత వచ్చేది జూన్ నెల. జూన్ 1న ఆయన తనువును వీడారు. ఒక నెలలోపునే ఆయన జయంతి, వర్ధంతిలు వస్తున్నాయ్. దేశరాజకీయాల్లో నీతిమంతునిగా– రాష్ట్రపతి పదవికి ఎదిగి, తన జీవితాన్ని మంచికి ఒదిగి, జీవించిన నీలం సంజీవరెడ్డిని వచ్చే జూన్1 నైనా వర్ధంతిదినంగా ఇరు రాష్ట్రాలూ జరుపుకోవడం సబబుగా ఉంటుందని 5 నెలలు ముందుగానే తెలుగువారందరికీ వినతి చేస్తున్నాను.

నీతిమంతులైన మనవాళ్ళను తలచుకోవడంతో భవిష్యత్తు తరాలవారికి జ్ఞాపకం చేసినవారమవుతాం. ●


# రామనామ తారకం భక్తిముక్తి దాయకం

**"సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకమూ రామచంద్రా.."**

ఈ కీర్తన విన్నారుగా? ఇలాంటివి వేలకువేలు కీర్తనలు రాసిన వాగ్గేయకారుడు రామదాసు. హైదరాబాదు సంస్థానాన్ని కుతుబ్‌షాహీ తానీషా పరిపాలించే రోజుల్లో నేలకొండపల్లిలో గోపన్న ఉండేవాడు. అతనికి చిన్నప్పటినుంచీ దైవభక్తి ఎక్కువ. గోపన్నను తానీషా భద్రాచలానికి తహసీల్దార్‌గా నియమించారు. భద్రాచలంలో గోదావరి నది ఒడ్డున ఒక పురాతన ఆలయం ఉండేది. ఇది చాలా శిథిలమై పోయింది. అందులో సీతారాముల విగ్రహాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండేవి. గోపన్న ఆ ఆలయాన్ని బాగు చేయించాలని భావించి గొప్ప శిల్పులను పిలిపించి ఆలయం పని మొదలు పెట్టాడు. పన్నుల రూపంలో వసూలయిన ఆరులక్షల రూపాయలను ఆలయ పనుల కోసం ఉపయోగించాడు. ప్రజలు చందాలు ఇచ్చిన నాలుగు లక్షల రూపాయలు కూడా ఖర్చు చేశాడు. ఆలయం చాలా సుందరంగా తయారయింది. అయితే ప్రభుత్వ ధనం ఖజానాకు చేరకపోవడంతో రాజు తానీషాకు కోపం వచ్చింది. భటులు గోపన్న చేతికి సంకెళ్ళు వేసి గోల్కొండకు తీసుకుపోయారు. తాను భగవంతుడు శ్రీరామునికొరకే ధనాన్ని ఖర్చుచేశానని, ఏనాటికైనా ఆ ధనాన్ని శ్రీరాముడే ఇస్తాడని గోపన్న తానీషాకు చెప్పాడు. అయితే శ్రీరాముడు వచ్చి ధనం ఇచ్చేవరకు గోపన్నను చెరసాలలో పెట్టండని భటులను ఆజ్ఞాపించాడు రాజు. చెరసాలలో ఉన్న గోపన్న శ్రీరాముడిపై ఎన్నో కీర్తనలు రాశాడు. పన్నెండు సంవత్సరాలు గోపన్న జైలులో ఉన్నాడు. ఓ రోజు రామలక్ష్మణులు రాజకుమారుల రూపంలో తానీషా వద్దకు వచ్చారు. ఆరు లక్షల రూపాయలు చెల్లించారు. గోపన్నను వదిలివేయమని చెప్పారు. వారు ఇద్దరూ చెరసాల వద్దకు పోయి గోపన్నను 'రామదాసూ' అని ప్రేమతో పిలిచారు. తన తప్పును తెలుసుకున్న తానీషా రామదాసు వద్దకు వచ్చాడు. తనను క్షమించమని వేడుకున్నాడు. అంతులేని ధనరాశులను ఇచ్చి భద్రాచలం పంపించాడు. రామదాసు చనిపోయినా ఆయన నిర్మించిన భద్రాచల రామాలయం, ఆయన రాసిన కీర్తనలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఇది తెలుగు వాగ్గేయకారుని విధేయభక్తి. ●



# సముద్రములోని నీటిబిందువుల నెన్నుట ఎంత కష్టమో సీనియర్ సముద్రాల సాహితీ వైభవం విశ్లేషించుటంత కష్టం!



ఆయన అందర్నీ తన మాటల పాటల పూదోటలో పూలమూటలొసగి సంతోషపరిచాడు! సంతోషవదనంతో సినీ సాహితీ నందనవనాన్నీ ఆనందపరిచాడు. ***అందమే ఆనందం – ఆనందమే జీవితమక రందమని*** కీర్తనల్లో ఆనందమకరందాన్నందించినారు. అంతర్లీనంగా ఆయన అంతరాళం ఆనందకందితం కాలేదు. అక్కినేని నాగేశ్వరరావుకు అక్షణ సౌలభ్య కారకుడాయెన ఘంటసాలకు తన యింట వసతి కల్పించిందాయనే! హెచ్.ఎం.రెడ్డిగారి 'గృహలక్ష్మి' చిత్రాన్నుంచీ వందేమాతరం, సుమంగళి, దేవత, భక్తపోతన చిత్రాల విజయంతో సముద్రాల వేంకట రాఘవాచార్యులుగారి సినిమా రచనాతోరణం జాజ్వల మానమైంది. మామిడితోరణంలా తెలుగు సినిమా పాటలకు మంగళతోరణం కట్టినదాయెనే! సర్వమంగళ సీతారామా– రామా యని 'పోతన' చిత్రంలోని ఆయన పాట కలికితోరణం. 'వందేమాతరం' చిత్రం దక్షిణాదిని విజయవంతమైంది. అప్పటి మైసూరు మహారాజా ఆ చిత్రాన్ని కోరికోరి తన రాజసౌధంలో ప్రదర్శింపచేసుకున్నారు. సముద్రాల రాఘవాచార్యను ప్రశంసించారు. 'స్వర్గసీమ' చిత్రం తెలుగు చలనచిత్ర సీమకొక స్వర్గసీమ. మద్రాసు నగరంలో సంవత్సరంపాటూ ఒకే థియేటర్‌లో ప్రదర్శింపబడింది. సముద్రాల రాఘవాచార్యులుగారు ఈ చిత్రంలోనే ఘంటసాలను గాయకునిగా పరిచయం చేసారు. భానుమతి పాడిన 'ఓహోహో పావురమా' – అన్నపాట అన్ని భాషలవారినీ ఆనందకందితుల్ని చేసింది. నాగయ్య నటన, స్వరకల్పన గానం యీ చిత్రంలోని విశేషం. ఈ చిత్రంలోనే సిహెచ్ నారాయణరావు ప్రతినాయకునిగా ప్రవేశించారు. భానుమతితో కలిసి నర్తించారు. హుషారుగా చిత్రం కథాగమనం సాగడానికెంతో ఈ పాట ఊపునిచ్చిందంటే సముద్రాల రాఘవాచార్య రచనం ప్రధానకారణమని చెప్పకతప్పదు. భానుమతి తండ్రిగా ముదిగొండ లింగమూర్తి భాషణలు ఆ రోజు పల్లెనాటి దొమ్మరిల నాటక విశేషాల్ని దోసిళ్ళతోపోసిన మల్లెల్లా గుభాలింపచేసాయ్. వాహినీవారు, విజయావారు తొలిచిత్రాల్లో సముద్రాల రాఘవాచార్యులగారి పాటలే జనాన్ని ఆకట్టుకున్నాయ్. వారి పదాల నుడికట్టు, తెలుగు అక్షఉ పరువపు పదకట్టులను చాలామంది అనుకరించినా రాఘవాచార్య కలంలోని మధురత్వానికి సాటి రాలేదు గువ్వలచెన్నా– అన్నది అక్షఉలా సత్యం.

నాకూ సముద్రాల రాఘవాచార్యకున్న అనుబంధం అనిర్వచనీయమైనది. ఒక పత్రికా రచయితైన నన్ను మధురవాగ్విభవ భూషణునిగా ఆలింగనము చేసుకున్నంత అనుభూతిని కల్గింపచేసారు. 'పోతన'లోని 'సర్వమంగళనామా సీతారామా' అను పాట, బ్రతుకుతెరువులోని 'అందమే ఆనందం ఆనందమే జీవన మకరందం', 'లవకుశ'లోని లవకుశులు పాడిన పాట–ఇలా యెన్ని పాటలో, ఎన్నెన్ని చిత్రాల్లోని సంభాషణలో సముద్రాలవారికి సముద్రంలోనున్న బొట్టు బొట్టు నీరులా– లెక్కలేనన్ని అక్షర సంపదను మూటగట్టుకున్నాయ్. వినోదావారి 'బాలసన్యాసమ్మ కథ' ఘంటసాల నిర్మించిన 'భక్తరఘునాథ్' చిత్రాలకు సముద్రాలగారే దర్శకత్వం వహించారు.

సముద్రాల వేంకటరాఘవాచార్యులుగారు సినిమా రంగంలో ప్రవేశించడానికి ముందూ, ఆయన వెనుకా వచ్చిన రచయితలెవ్వరూ, సముద్రాల వేంకట రాఘవాచార్యులు గారు పనిచేసినన్ని చిత్రాలకు రచన చేయడం గానీ, వారు పనిచేసిన చిత్రాలను అధిగమించినవారు కానీ లేరు. ఎప్పటి గృహలక్ష్మి, ఎప్పటి వందేమాతరం, ఎప్పటి బ్రతుకుతెరువు ఎప్పటి సీతారామకల్యాణం, ఎప్పటి లైలామజ్నూ, ఎప్పటి దేవదాసు, ఎప్పటి బాలరాజు, ఎప్పటి అనార్కలి, భక్తపోతన, యోగివేమన, గుణసుందరికథ ఇలా యెన్నో యెప్పట్లివో చెప్పుకోవాలి. శతాధిక చిత్రాలకు పనిచేసినా– ఆయన అలుపుచెందలేదు. రోజుకు నాలుగు కంపెనీలకు వెళ్ళి కథా సమావేశాల్లో పాల్గొనేవారు.


వారు వ్రాసిన సంభాషణల తీరూ, వారు వ్రాసిన పాటలసౌరూ – యే యితరులకూ కలుగనేలేదు. ఆయన కుమారుడు జూ॥ సముద్రాల రామానుజానికి కొన్ని సంస్థలను విడిచిపెట్టారు. సముద్రాల రామానుజం చాలా చిత్రాల్లో ముఖ్యంగా ఎన్.ఏ.టి. (ఎన్టీరామారావుగారి సంస్థ)లో గణనీయంగా పనిచేసారు. కీర్తిని విస్తరింపజేసుకున్నారు. కానీ రాఘవాచార్య రచనా సౌరూ రామానుజానికి రానేరాలేదు. మొత్తానికి తండ్రీ కొడుకుల బాణీయే వేరు. (క్రె.కామేశ్వరరావుగారూ, సముద్రాల రామానుజం, నేనూ కలిసి 'శ్రీకృష్ణ కుచేల'కు స్క్రీన్‌ప్లే వ్రాసాం. అప్పుడు జూ॥ సముద్రాల కథనంపై చూపించిన పస, భాషపై గల కసీ వేరొకరిలో చూడలేదు) రామానుజం తండ్రికి తగ్గ కొడుకు. మేము ఇరువురమూ 'మధురవాణి' పత్రికలో అనిర్వచనీయం శీర్షికను వ్రాసేవారము.

సముద్రాల రాఘవాచారిగారి హస్తవాసి చాలా గొప్పది. ఆయన తన యింట్లో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుగారి సంభాషణలను చక్కని ఉచ్ఛారణతో చెప్పగల శక్తి ప్రసారం చేసారు. ఘంటసాల వెంకటేశ్వరరావుకు తన యింట్లో స్థావరం కల్పించారు.

మా పెద్దబ్బాయి వేంకటేశ్వరరావుకు అక్షరాభ్యాసం వారే చేసారు. ఈనాడు నాతో సమముగా 'ప్రముఖాంధ్ర'లోని జి.వి.రావు పేజీ వ్రాస్తున్నాడంటే– రాఘవాచార్యుల హస్తవాసి కారణం.

ఇందులో ఎన్నో విశేషాల విశ్లేషణం చేసానుగానీ, సముద్రాల వేంకటరాఘవాచార్యగారి సినిమా కృషీవలత్వాన్ని సహస్రాంశం కూడా చెప్పలేదు. ముందుముందు సంచికల్లో మరో ప్రత్యేక వ్యాసాన్ని వ్రాస్తాను. ఒక్క విషయం చెప్పకతప్పదు. ఎన్టీ రామారావుగారు కొత్త సినిమా ప్రారంభించేముందు అడ్వాన్సుతోబాటు తెల్లకాగితాల ఫైలూ, ఓ క్రొత్త పెన్నూను సముద్రాల కిచ్చేవారు. ఆ చిత్రం శత, ద్విశత దినోత్సవాల్ని చేసుకొనేది. సముద్రాల చిరంజీవి. ●

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై. ఎస్సార్ కృష్ణారావు ఐ.ఏ.ఎస్



అనుభవం. మంచితనం, నికార్సుతనం ముమ్మూర్తులా మూర్తీభవించిన మహామనిషి ఐ.వై. ఎస్సార్ కృష్ణారావు. ఇలాటి సమర్థుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ప్రధానకార్యదర్శిగా నియమింపబడడం ఆంధ్రప్రదేశ్ చేసుకున్న పుణ్యఫలం. వారిని ప్రధాన కార్యదర్శిగా నియమిస్తే బాగుంటుందని 'ప్రముఖాంధ్ర'లో ఎప్పుడో వ్రాసాం.

కృష్ణారావులో ఆధ్యాత్మిక చింతన యెక్కువ; పాలనావ్యవహారత నెరిగినవాడు. ఎటువంటి మొహమాటాలూ లేకుండా, పరులను నొప్పించకుండా ఉద్యోగ విధులను నిర్వహించడంలో ఘనాపాటి, నిగర్వి, నిరాడంబరుడు.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలనాధికారిగా ఆయన కార్యనిర్వాహక విధులను నేను నిశితంగా పరిశీలించాను. ఏ శాఖ యెలాపనిచేస్తుందో తెలుసుకోవడానికి ఆయన ఆకస్మిక తనిఖీలు చేసేవారు. ఆయన యేశాఖ పరిశీలనకు వెళ్ళేవారో ఆయన వ్యక్తిగత కార్యదర్శులకే తెలిసేది కాదు. కానీ ఆయన నిర్దేశించిన కాలానికి, కార్యాలయంలో కలుసుకుని మాట్లాడవచ్చు. సమయపాలన పాటించే అధికారి ఐ.వై.ఎస్. కృష్ణారావు.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలన సాధారణమైన పాలన కాదు. ఓ రాష్ట్రముఖ్యమంత్రి పాలన వంటిది. కత్తిమీద సామువంటిది. ఆనాడు ఆంధ్ర రాష్ట్ర గవర్నరు త్రివేది వలె, ఈ నాటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్య కార్యదర్శి బాధ్యతల్ని వహించే ఐ.వై. ఎస్సార్ కృష్ణారావును మేము అభినందిస్తున్నాం. విధి నిర్వహణంలో మాకు తెలిసినంతవరకూ శ్రీ ఐ.వై ఎస్సార్ కృష్ణారావును మించినవారు లేదు.

**భగవంతుడాయనకు దీర్ఘాయురారోగ్య ఐశ్వర్యము లొసంగుగాత.**

# అ(నన్త)నంతపురం నానాసాహెబ్, దివాన్ బహద్దూర్ గుత్తి కేశవపిళ్ళై

## -పిళ్ళై అడ్డుకోకపోతే అనంతపురం జిల్లా ఉండేది కాదు-

కేశవపిళ్ళైను అందరూ రాయలసీమ ఆణిముత్యం అనేవారు. 1931వ సం॥ములో అప్పటి బ్రిటిషు ప్రభుత్వం అనంతపురం జిల్లాను రద్దు చేసి, సరిహద్దు జిల్లాల్లో కలిపివేయాలని నిర్ణయించినప్పుడు- అందుకు వ్యతిరేకంగా మహోద్యమం చేపట్టి అడ్డుకున్నారు. అది హింసోద్యమేమీ కాదు జనగణ స్వరాలను సమీకరించి, శాంతియుత ఆందోళనయే చేసారు. అనంతపురం జిల్లా అదృశ్యం కాకుండా చేసిన అమృతమూర్తి కేశవపిళ్లై. 1925వ సం॥ములో దత్తమండలాలకు (అప్పటి రాయలసీమ) నీటిపారుదల కమిటీ సభ్యుడుగా ఉంటూ- తుంగభద్ర ప్రాజెక్టు కోసం అవిరళ కృషి చేసారు.

ఇతఃపూర్వం 1884 సం॥ములో గుత్తి పట్టణానికి నీటి కరవు యేర్పడింది. ప్రజలు నీరులేకుండా విలవిలలాడుతున్నారు. కేశవపిళ్లై అనంతపురం జిల్లా కలెక్టర్ వద్దకు తన మిత్రులతో కలిసి వెళ్లి- పరిస్థితులను వివరించారు. గణనీయంగా లెక్కలతో సహా వివరించేటప్పటికి కలెక్టర్ ముగ్ధుడయ్యాడు. ఆయన విషయ పరిజ్ఞానాన్ని, వాగ్ధాటిని సౌరభాన్నీ చూచి, ఆయన్ను జిల్లా బోర్డు సభ్యునిగా నియమించారు. అనన్తరం అనంతపురం జిల్లాబోర్డు అధ్యక్షులయ్యారు. ఓ దశాబ్దకాలం ఆ పదవిలో ఎన్నో జనోపకర కార్యక్రమాలను చేబట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ అప్పటి ఉమ్మడి మద్రాసు కౌన్సిలు సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర నాయకులయ్యారు. దీనితో గుత్తికి రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చింది. గుత్తి అనే పట్టణం రాష్ట్ర కౌన్సిలు సభ్యుల దృష్టిలో పడింది. రాజకీయ నాయకుల్లో కేశవపిళ్ళైది ఓ ప్రత్యేక స్థానం. ప్రజలకు అన్యాయం జరిగితే ప్రభుత్వానికి సహకారధోరణినవలంబించి సాఫల్యం చేసుకునేవారు. సమస్య తీరకుంటే పోరాడడానికి వెనకడుగు వేసేవారు కాదు. వారు దాదాపు ప్రజా సమస్యలన్నిటినీ ప్రభుత్వంతో సామరస్యంగానే పరిష్కరించుకునేవారు. అన్యాయాన్ని అరికట్టే ప్రయత్నంచేసేవారు.



1893 అక్టోబర్ 4న అనుకుంటాను. ఆంగ్లసిపాయిలు హిందూ స్త్రీలను బలాత్కరించే ప్రయత్నం చేసారు. గూళపాలెం హంపన్న అడ్డుకున్నాడు. ఆ ప్రయత్నంలో అతడు అసువులు బాసాడు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించిన పిళ్ళై అన్ని ఆంగ్ల పత్రికల్లోనూ ఆ వార్తను పెనువార్తగా వచ్చేట్లు చేసారు. అప్పుడాయన 'ది హిందూ' ఆంగ్ల దినపత్రికా విలేఖరిగా ఉంటూండేవారు. హంపన్న హత్యోదంతాన్ని కోర్టువరకూ తీసుకుని వెళ్ళి- ఆ హంతకులకు శిక్షపడే వరకూ పిళ్ళై నిదురపోలేదు. ఆ విషయం అందరికీ గుర్తుగా నిలిచేట్టు హంపన్న స్మారకస్థూపాన్ని ప్రతిష్ఠింపచేసారు. ఆ స్థూపాన్ని అక్కడ నుండి తొలగించాలని ఆంగ్లేయులు భావించారు. వారి ప్రయత్నాన్ని పిళ్ళై అడ్డుకుని అదక్కడ శాశ్వతంగా నిలిచేట్లు చేసారు.


కేశవపిళ్ళై విద్యావేత్త, అనంతపురం జిల్లాలో ఎన్నో పాఠశాలలు యేర్పడానికి కృషి చేసారు. రాయలసీమను విద్యాసీమగా తీర్చిదిద్దాలని ఎన్నో ప్రయత్నాలు చేసారు. ఎన్నో కలలు కన్నారు. ముఖ్యంగా ఆయన హరిజనోద్ధరణకు కృషి చేసారు. ప్రభుత్వం ఆయన సేవల్ని గుర్తించి 'దివాన్ బహద్దూర్' బిరుదముతో గౌరవించింది. హిందూ ముస్లిముల తగాదాలొచ్చినపుడు వాటిని సామరస్య ధోరణిలో పరిష్కరించడానికి కృషి చేసేవారు. కొన్ని జటిల సమస్యలేర్పడినపుడు వాటిని 'హిందూ' పత్రికలో ప్రచురింపబడేట్లు చేసి, ప్రభుత్వ దృష్టికి తీసుకునివెళ్లేవారు. ఆయన హింసాత్మక విధానాలనవలంభించిన వైనం లేదు. కానీ పత్రికల్లో అన్ని విషయాల్నూ కూలంకషంగా విశ్లేషించేవారు. ఆయన హిందూ పత్రికలో వ్రాసిన వ్యాసాలు ఆయనకు మంచి కీర్తిని తెచ్చిపెట్టింది.

1921 సం॥ములో బ్రిటిష్ గయానాకు వెళ్ళిన భారత ప్రతినిధి వర్గానికి పిళ్ళైగారే నాయకత్వం వహించారు. ఆయన 1884 సం॥ములో గుత్తిపట్టణంలో తొలి జనసంఘం స్థాపించారు. ఆ సంఘానికి 25 సం॥ములు కార్యదర్శిగాను, 20 సం॥లు అధ్యక్షునిగాను సేవలందించారు.

తమిళనాట ఉత్తర ఆర్కాటు జిల్లా, గుడియాత్తం తాలూకా 'పట్టు' గ్రామంలో 1860 సం॥ము అక్టోబర్ 18న జన్మించిన కేశవపిళ్లై చిత్తూరులోని హైస్కూలులో చదువుకున్నారు. అక్కడే మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణుడై తిరిగి తిరుత్తణి వచ్చి, న్యాయవాద పరీక్షలో ఉత్తీర్ణుడై, గుత్తి పట్టణానికి వచ్చి న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. న్యాయమేదో, అన్యాయమేదో ఆయనకు క్షుణ్ణంగా విదితమే! ఎక్కడ ఏ అన్యాయం జరుగుతున్నా, ఆ అన్యాయాన్ని కూకటివేళ్ళతో పెకలించి పారేసేదాకా ఆయన నిదురపోయేవారు కారు. 'పట్టు' గ్రామంలో పుట్టినందువల్లనో యేమో ఆయనలో అంతపట్టుదల యేర్పడింది. అన్యాయాన్ని చూస్తూ ఊరుకొనేవారు కాదు. పోనీ హింసాత్మకంగా ఎదుర్కొంటున్నారా- అంటే లేనేలేదు.

పట్టు గ్రామంలో పుట్టినందువల్ల పట్టు కేశవపిళ్ళై, గుత్తిపట్టణాన్ని స్థిరనివాసం యేర్పరచుకున్నందున గుత్తి కేశవపిళ్ళైగా పిలువబడుతుండేవారు. దేశసేవ చేసేవారికి దేశమే తల్లి. దేశంలో ఏ ప్రాంతంలో ఉంటున్నప్పటికినీ ఆ ప్రాంతానికి సేవ చేయడం, నిష్కామ, నిరాడంబర సేవలు చేయడం సమంజసం. ఆయనకు కాంగ్రెస్‌తో అంతటి అనుబంధం యెలా యేర్పడిందాయని మనం ప్రశ్నించుకోవచ్చు. 1885 సం॥ములో డిసెంబర్ నెలలో బొంబాయి నగరంలో భారత జాతీయ కాంగ్రెసు పార్టీ మహా సభ జరిగింది. ఆ సభకు రాయలసీమ నుంచి కాంగ్రెస్ ప్రతినిధిగా కేశవపిళ్ళైను పంపించారు. అప్పటి కాంగ్రెసు అధ్యక్షురాలిగా అనిబీసెంట్ ఉండేవారు. ఆమె తెల్లజాతి మనిషి. కాంగ్రెస్ రాజకీయాలకు ముగ్ధురాలై భారత జాతీయ కాంగ్రెసుకు తొలి అధ్యక్షురాలిగా ఎన్నుకోబడ్డారు. ఆమె రాయలసీమ నుంచి ఏకైక ప్రతినిధిగా వచ్చిన కేశవపిళ్ళైను చూసారు. మంచి యువకోత్సాహంతో ఉన్నారు. సేవాదృక్పథం గల వ్యక్తిగా కనిపించారు. ఇలాంటి యువకోత్సాహం కలవారితోనే కాంగ్రెస్ భవిష్యత్తు, బంగారంగా ఉంటుందని విశ్వసించి, సహాయ కార్యదర్శి పదవినిచ్చారు. ఆయనపై అనీబిసెంట్ పెట్టిన నమ్మకం వమ్ముకాకుండా కేశవపిళ్ళై శ్రద్ధగా జనులతో మమేకమై కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకుని వెడుతున్న విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించింది. పిళ్ళై వారి విశ్వాసానికి తగినట్లుగానే అహరమూ కృషి చేసారు. అనంతపురంనుంచీ గంజాము వరకు గల 11 జిల్లాల ప్రతినిధిగా, శాసనమండలి సభ్యునిగా 1919 సం॥ములోను 1926 సం॥ములోను రెండు పర్యాయములు సభ్యునిగా, ఉపాధ్యక్షులుగా నియమింపబడ్డారు. తేనెలో ముంచిన రొట్టెముక్కలా ఆయనకు పదవులు పరిచినట్లు వస్తూనే ఉన్నాయ్; స్వయంప్రతిభా విశేషాలతో తన పదవులకు వన్నె కూరుస్తూ పిళ్ళై తెలుగు ప్రాంతానికి వచ్చి, తెలుగువారితో కలిసి, తెలుగువాడైపోయిన తమిళబిడ్డ పట్టు కేశవపిళ్ళై- గుత్తి కేశవపిళ్ళైగా కీర్తింపబడ్డాడు. 1923 సం॥ములో శాసనమండలిలో మత ధర్మాదాయ బిల్లును ఆమోదింపచేయడంలో ఆయన కృషి ఎంతో ఉన్నది. అప్పుడాయన వయసు 25 సం॥ముల లోపే.

ఇప్పటివారికి తెలుసోలేదో- అనంతపురం జిల్లా నిలుపుకోలుదనంలో గుత్తి కేశవపిళ్ళైయే మూలకారకుడూ, మూలపురుషుడూ! కేశవపిళ్ళై కృషి లేకుంటే అనంతపురం జిల్లా ఉండేదే కాదు. మద్రాసు శాసనమండలి పితామహునిగా 'గుత్తి'వారని పిలిచేవారు. విశాలోన్నత హృదితో కృషి చేసిన కేశవపిళ్ళై- గుత్తిలోని స్వగృహంలోని 73యేట1933 సం॥ము మార్చి 28న దివంగతులయ్యారు. తొలి రాష్ట్రపతి డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ 1935 సం॥ములో అనంతపురంలో ఆయన పేరిట 'కేశవ విద్యానికేతనం' హరిజన హాస్టల్ని ప్రారంభించారు. 1984 వ సం॥ము అక్టోబర్ 28న భారతప్రభుత్వం కేశవపిళ్ళై జయంతికి ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఇంతగా ఖ్యాతిగాంచిన కేశవపిళ్ళైను ఎంతమంది జ్ఞాపకం పెట్టుకున్నారు? గుత్తి, అనంతపురం వాసులైనా కేశవపిళ్ళై పేరు నెరుగుదురాయని గోటేటి ప్రశ్నిస్తున్నాడు. గోటేటి **ప్రముఖాంధ్ర**కు తక్క ఎవరికీ ప్రతిభావంతుల పేరులు కావాలి? ●



### సత్యసాయియీ అనుగ్రహం పొందిన

# కొమరగిరి కృష్ణమోహనరావు

***సాహిత్య ఆలోచనామృతం - సంగీతం ఆ పాతమధురం***

**జననం: 1936సం॥ మే 1 వ తేదీ**

**మరణం : 2009 ఆగస్టు 12 వ తేదీ**

*కారణజీవి, కర్మజీవి, ధన్యజీవి శ్రీ కొమరగిరి. ఆంధ్రప్రజానీకాన్ని, దేశభక్తి భావాలతో జాగృతం చేసి, ఆధ్యాత్మిక భావాలతో ఉపన్యాసాలతో జనబాహుళ్యాన్ని ఉఱ్రూతలూగింప చేసిన ఉద్ధండుడు. తనదైన శైలిలో తన విలక్షణ రచనలతో పాఠకులను ప్రభావితం గావించిన ప్రతిభావంతుడైన పత్రికా సంపాదకుడు. ఖండఖండాంతరాలకు సత్యసాయి ప్రేమతత్వాన్ని వ్యాప్తి గావించిన ఆధ్యాత్మికవేత్త కొమరగిరి కృష్ణమోహన్‌రావు.*

అనేక వేల సంవత్సరాల వేదవిజ్ఞాన చరిత్రగల పుణ్యభూమి భారతభూమి. అనేక దేవతలు కాలిడిన వేదభూమి.

కర్మణ్యేవ్యాధికారస్తే మాఫలేషు కథాచన- అను కర్మసిద్ధాంతాన్ని వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, నీతి కథల్ను, నిత్య నూతనా సంవిధానంతో జనులను, మమైకం చేసిన కర్మసిద్ధాంతపరులు రచయితలుగా పత్రికా రచయితలుగా తెలుగు భూమినే గాకుండా అఖిల ప్రపంచంలోనూ చైతన్యం తీసుకుని వచ్చారు. సంగీత, నృత్య, దేశీయ, జానపదులకు వారు చేసిన సేవల్ను అక్షఱబద్ధం చేయడం సాహసమే! ఆ సంస్కృతిని నిక్షిప్తం చేయడానికైనా వారి కృషిని సంస్మరణం చేయాలి!

అలాటి గొప్పసామాజిక వేత్త, సంస్కరణాభిలాషీ. పత్రికా రచయిత కొమరగిరి కృష్ణమోహనరావుగారు అభినందనీయులు. వారు జీవించిన కాలం 73 సంవత్సరములే. కానీ వారు మనకు ఓ వెయ్యి సంవత్సరాలు నిలిచే సేవ చేశారు.

పౌరుల హృదయాల్లో దేశభక్తిని అంకురింపచేసారు. ఆధ్యాత్మిక సంపదను పెంపు చేసారు. చెరుకువాడ నరసింహం పంతులుగారి వలె జనులను ఉఱ్రూతలూగించారు. 'శ్రీవాణి' మాసపత్రిక ద్వారా జనుల్లో దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి, పంచమాతృ కల భక్తి, పితృభక్తి, భాతృభక్తి, సహసమాజం పట్ల సమభక్తిని విస్తృతింప చేసారు.

ఇదో పూర్వజన్మ సుకృతి ఉంటేగానీ ఈ మర్యాద రాముని సుగుణాలు అలవడవు. స్థైర్యం ఉండాలి; ధైర్యం ఉండాలి. తోటి మానవుని అభ్యున్నతి పట్ల ఆసక్తి ఉండాలి. ఆధ్యాత్మిక చింతన ఉండాలి. పైవాటి యందు ఏ ఒక లక్షణలక్ష్యం లోపించినా ఫలసిద్ధి కలుగదు.

ప్రతీమంచి వ్యక్తీ మార్గాన్ని యెంచుకునేటప్పుడు ఓ వ్యక్తి మార్గదర్శనం చేస్తాడు. అలా మార్గదర్శనం చేసినవాడు మహారాష్ట్రలోని ఠాగూర్‌గారు. ఆయన భారతీయ జనసంఘ స్థాపకుల్లోని వ్యక్తి. ఆయన ఆంధ్రరాష్ట్రంలో జనసంఘం స్థాపనం కోసం ఎన్నుకున్న వ్యక్తి కొమరగిరి కృష్ణమోహనరావు. రాజకీయ దృష్టి లేకుండా భారతీయ ధర్మపరిరక్షణం కోసం స్థాపింపబడిన సంఘం. అప్పట్లో ప్రాచుర్యంగల కాంగ్రెసు, కమ్యూనిస్టుల మధ్య పయనించాలంటే పెద్దపులి పాలుపితకడం వంటి సాహసం చేయాలి. ఠాగూర్‌గారికి అలా పనిచేయగల వ్యక్తిగా కొమరగిరి మోహనరావు కనిపించారు. ఆంధ్రదేశానికి జనసంఘం కొత్తది. ఆ పేరు విన్నవారే లేరు.

కొమరగిరివారు తనకిచ్చిన బాధ్యతను ఓ సవాలుగా తీసుకున్నారు. ఆంధ్రదేశంలోని పల్లెపల్లెకూ తిరిగారు. గ్రామగ్రామాన సభలు పెట్టారు. వారి ఉపన్యాస చాతుర్యాన్ని ప్రత్యర్థులు కూడా ప్రశంసించేవారు. మరి కొంతసేపు ఆ సభలో ఉంటే- ఆ ఉపన్యాస ప్రభావంతో తమ తమ పార్టీలకు విధేయంగా పనిచేయలేమోనని భావించేవారు. అయినా ఉపన్యాసం చివరివరకూ ఉండి- మీరు మా పార్టీలో చేరండి మిమ్మల్ని మంచి పదవుల్లో కూర్చోపెడతామని ప్రలోభపెట్టేవారు. ఏ ప్రలోభాలకూ తలొగ్గని నికార్సయిన మనిషి. తాను నమ్మిన జనసంఘ సిద్ధాంతం కోసం అహరహమూ కృషిచేసిన మహా మనిషి.

జనసంఘం కార్యకర్తల్లోని, మహోపన్యాసకుల్లో ఉత్తర భారతాన అటల్ బిహారీ వాజ్‌పేయి, దక్షిణాదిన కొమరగిరి కృష్ణమోహన్ రావుగారే ప్రజలను సమ్మోహపరచగలరనే పేరు వ్యాప్తినొందినది. అప్పటికింకా భారతీయ జనతాపార్టీ యేర్పడలేదు.

శ్రోతలస్థాయిపట్ల అవగాహన, ఉపన్యసించే విషయంపై పట్టూ, గంభీరత, భాషలో, భాష్యంలో చక్కనితీయతనం, అంకిత భావుకత ఆయన కబ్బిన సహజనైపుణ్యాలు.

ఆనాడూ మతమార్పిడులుండేవి. అలాటి ప్రదేశాలకు పార్టీ పంపగా వెళ్ళారో, తనకు తానుగా వెళ్ళారోగానీ- కేరళలోని ఒక జిల్లాను మతప్రాచుర్యజిల్లాగా ప్రకటించాలని అక్కడి రాష్ట్రప్రభుత్వ నిర్ణయానికి ఆయన నిరసనోద్యమాన్ని జరిపారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయనుందని ఆయనకెరుకే! అందుకాయన భయపడలేదు. అరెస్టు అయ్యారు.

1972 సం॥ములో 'జైఆంధ్రా' ఉద్యమం జరిగినపుడు కూడా పాల్గొన్నారు. అరెస్టయ్యారు. 1975 సం॥ములో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించినపుడు కూడా ఆయన ఉద్యమించి మొదటి బాచ్‌లోనే అరెస్టయి పంతొమ్మిది నెలలు కారాగారశిక్ష అనుభవించారు. ఉద్యమాలాయనకు కొత్తకావు. వాటిల్లో నిజాయితీని గ్రహించి ఉద్యమకారుల్లో మొదటి వ్యక్తిగా పాల్గొనడం ఆయన ధర్మంగా భావించేవారు.

ఆ రోజుల్లో స్వేచ్ఛా సమరయోధుడు జయప్రకాష్ నారాయణ తలపెట్టిన మహోద్యమంలో పాల్గొనడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రచారశాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేసారు.

అవినీతి అన్యాయములను తునుమాడుతూ అంకిత భావంతో, అవిశ్రాంతంగా ఆయన చేసిన ఉద్యమాలు దేశనాయకులను ఆకట్టుకున్నాయి.

రాజకీయ నాయకుడు నీతిమంతుడూ, సమర్థుడైతే దేశం బాగుపడుతుంది. అందుకు పునాదుల్ను బాల్యంలోనే పాదుకొల్పాలి. అందుకు ప్రాతిపదిక చక్కని ప్రాథమిక పాఠశాలలుండాలి. ఆలా ఆలోచించి 1969 నందిగామలో వివేకానంద విద్యానికేతనం స్థాపించారు. గురుకుల స్థాయి విద్యగరపడంలో వారు స్థాపించిన పాఠశాల చాలామంది విద్యార్థులను సుశిక్షితులుగా, దేశభక్తి పరాయణులుగా తీర్చి దిద్దాలన్న వారి సంకల్పం నెరవేరింది. అలా విద్యగరిపే విద్యాలయాలకు అనుబంధంగా, భోజనవసతులు కల్పించడం, వారిని చూడడానికి వచ్చే బంధుమిత్రులు ఆ విద్యార్థులు వండిన వంటకాల్ను భుజించే **(తరువాయి 10వ పేజీ)**

# వ్యాపారపరంగా, ఆధ్యాత్మికపరంగా
# కె.వి సుబ్రహ్మణ్యం అకుంఠిత శక్తిమంతుడు



సుబ్రహ్మణ్యం దంపతులు

కర్నూలు వెళ్ళినపుడెల్లా మౌర్యా-ఇన్ హోటల్ ప్రక్కగా- ఉన్న పారిశ్రామిక వీధిలోని శిల్పా ఎంటర్‌ప్రైజెస్‌కు వెడుతూంటాను. వ్యాపారపరంగా, ఆధ్యాత్మికంగాను అకుంఠిత కృషి చేస్తున్నవాడు కె.వి. సుబ్రహ్మణ్యం. ఆప్యాయతలో కూడా ఆరడగులకు పైగా ఎదిగిన ఆర్యవైశ్య బిడ్డ. ఇంచుమించు 64 యేళ్ల వయసు వున్నా 24 యేళ్ల వయస్సంత ఉత్సాహం ఉంది. ఉత్తేజముంది. సమాజానికి సేవచేయాలనే సంకల్పం ఉంది.

వ్యాపారం నాకు చాలు, ఏలోటూ లేదను భావం ఏమాత్రములేనివాడు. పెద్దలంటే గౌరవం కలవాడు. క్రమం తప్పకుండా పి.జి. డిగ్రీ కళాశాల, శ్రీ విజయదుర్గా డిగ్రీ కళాశాలల్లో - ప్రతీ ఆదివారమూ సత్సంగం తరగతులను నిర్వహిస్తూనే ఉంటారు. ఈ సత్సంగ సమావేశాలకు 'తత్వదర్శిని' అనే పేరు పెట్టుకోవడంలోనే సుబ్రహ్మణ్యం ప్రత్యేకత కనిపిస్తున్నది. కాకినాడ శ్రీపీఠం అధిపతి శ్రీపరిపూర్ణానందస్వామి చేతులమీదుగా ఈ సత్సంగం ప్రారంభించబడింది.

సుబ్రహ్మణ్యంగారితో ఓ పది నిమిషాలు మాట్లాడితే సత్సంగమవుతుంది. ఆ కాస్సేపటిలోనూ ఆయన ఎన్నో విషయాలను చెబుతారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నందువల్లనేమో ఆయన ఎరుగని విషయాలంటూ లేవు.

'జననీ జన్మభూమిశ్చ'- ఆయన పుట్టినదీ కర్నూలే, పెరుగుతూన్నదీ కర్నూలే! మధ్యలో కళాశాల విద్యాభ్యాసం కొఱకు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో చేరి- బి.ఎ. పట్టానందుకొన్నారు. అందునా వారికి ఆసక్తికల సైన్సు లిటరేచర్ చదువుకున్నారంటే విద్యార్థిదశలో వారెన్నుకున్న మార్గం తెలుస్తుంది. న్యాయ పట్టానందుకోవడం కోసం హైదరాబాదు ఉస్మానియా యూనివర్శిటీలో న్యాయశాస్త్రం అభ్యసించారు.

ఆధ్యాత్మికతయనేది చిగురించాలంటే ఆత్మను క్రమపథంలో క్రమశిక్షణాయుతంగా పెంపొందించుకోవాలిగానీ బోధనల వలన అలవడదు. నీ కులమెద్ది యని ప్రశ్నించినపుడు ఆధ్యాత్మిక కులమని చెప్పకలిగే ధీరత ఉండాలి. అనుసరిస్తూ, ఆచరించే సద్భావన కావాలి, కోటి విద్యలను నేర్చిననూ ఫలమేముంటుంది? జనకోటికి సేవచేయడంలోనే సద్భావనం ఉంటుంది.

ఆర్యవైశ్యులను అలరింపచేస్తున్నదే ధర్మగుణం, దయాశీలం. వాణిజ్యములో మునిగేవారికి సమాజసేవ చేయాలని ఉంటుంది. సమయం చిక్కదు. విద్యావంతులైనవారికి అసలు చిక్కదు. ఈ రెండిటికీ భిన్నమైన వ్యక్తి. కె.వి. సుబ్రహ్మణ్యం. పోనీ చేసిన ఉద్యోగాలు చిన్నవా - అంటే కానేకావు! చైనా పాకిస్తాన్ యుద్ధ సమయంలో పూనాలోని రక్షణదళం- సదరన్ కమాండ్‌లో ఆడిటర్‌గా పనిచేసిన నిపుణత ఉన్నది. దేశభక్తీయుతమైన ఆసక్తి అప్పుడే యేర్పడి ఉండవచ్చు. వారికి ఆధ్యాత్మిక జీవనం, సమాజసేవలో యెంతటి అనురక్తి ఉందో, అంతటి అనురక్తీ, విద్యారంగంపై కూడా ఉన్నదనడానికి ఆయనక్కడ పి.జి. కాలేజీలోను, విజయదుర్గా డిగ్రీ కళాశాలలోనూ - వ్యక్తి వికాసమును గురించి తరగతులు నిర్వహించడమే. మనిషి ఎదుగుదల జ్ఞానవికాసంలోనే ఉన్నదనే ప్రగాఢ విశ్వాసం సుబ్రహ్మణ్యం గారిలో పూర్ణంగా ఉన్నది. స్థానిక సిటీ కేబుల్ టి.వి.లో షిర్డీ సాయిబాబాను గూర్చి, ఏడువారాలు 30 నిమిషాలు చొ॥న ఆధ్యాత్మికమైన ఉపన్యాసములిచ్చారు. ఇవిగాక 'తత్వదర్శిని' అను పేరిట సత్సంగ సమావేశాలు నిర్వహిస్తుంటారు.

కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీకి 13 సంవత్సరములుగా సంయుక్త కార్యదర్శిగా ఉంటున్నారు. రక్తనిధి సంఘానికి సంయుక్త కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. విజయదుర్గా డిగ్రీ కాలేజీ చేర్మన్‌గానూ ఉన్నారు. అఖిల భారత రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులుగా సేవలందచేసారు. ఆదిశంకరాచార్య తపోవనం వృద్ధాశ్రమం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. కాశీ అన్నపూర్ణ ఆర్యవైశ్య సత్రంవారి శ్రీవారి సన్నిధి, తిరుపతి శాఖకు, షిర్డీసాయినాథ్ క్షేత్రంలో గల శాఖకు, వారణాసిలోని కాశీ అన్నపూర్ణ ట్రస్టులకు సలహాదారుగా ఉన్నారు. ఇలా యెన్నో యెన్నెన్నో సమాజ కార్యక్రమాలు చేస్తూనే కర్నూలులోని బళ్ళారిరోడ్డునందు మంచి కూడలిలో శిల్పా ఎంటర్ ప్రైజెస్ యనే గృహోపయోగ వాణిజ్య సంస్థను నిర్వహిస్తున్నారు.

వ్యాపారమూ, అపారమైన సేవాభావమూ, ఆధ్యాత్మిక చింతనా కల సుబ్రహ్మణ్యం గారిని ప్రశంసించకుండా ఉండలేకపోతున్నాను. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆంధ్రప్రదేశ్ పూర్వపు మంత్రీ, కర్నూలు ననేక విధాలుగా అభివృద్ధి చేసిన, చేస్తున్న టి.జి. వెంకటేశ్ గారంటే సుబ్రహ్మణ్యంగారికి యెనలేని అభిమానం, వారి 'మౌర్యా-ఇన్ హోటలనంటే వీరి వాణిజ్య సంస్థ ఉన్నది. సుబ్రహ్మణ్యంగారి కొక కుమార్డు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనవరాళ్ళతో ఆనందకరమైన అనురాగ కుటుంబం. **సంసారం, సంసారం ప్రేమసుధాసారం** అన్నట్లుగా సాగుతున్న ఆయన్ను చూచినపుడు నాకు ఆనందమే కలుగుతుంది. ఆయనతో మాట్లాడినప్పుడు ఓ తెలియని ఉల్లాసం పెల్లుబుకుతుంది. భగవాన్ సత్యసాయి చెప్పినట్లు 'పంటపండని భూమి పదియెకరములున్న నేమి కొంచెమైన చాలు మంచి భూమి'- అన్నారు. సత్సంగమునే కలిగి ఉండమనే ఆదిశంకరులూ చెప్పారు. వారందరి భావాలను వారు నడిచిన విధానాన్నీ భారతసంస్కృతినీ ఆచరణలో ప్రతిబింబింప చేస్తున్న కె.వి. సుబ్రహ్మణ్యం గారికీ, వారి కుటుంబ సభ్యులకు శుభాశీస్సులు. ●

(9వ పేజీ తరువాయి) కార్యక్రమాన్ని రూపొందించడం ఆయన కృషీవలత్వ చంద్రిక. కరీంనగర్, హైదరాబాద్, వరంగల్నుంచీ కూడా విద్యార్థులు ఆ పాఠశాలకు వచ్చి విద్యాభ్యాసం చేసేవారు.

వారు మచిలీపట్నం మకాము మార్చినపుడు కూడా అక్కడ అలాటి విద్యాలయాన్నే స్థాపించారు. రేపు యెలాగనే చింత వారికుండేది కాదు, సేవ చేయడమే కర్తవ్యం. ఏదో ఒకటి వచ్చి ఆదుకోకపోతుందా అనే ధైర్యం ఆయనలా ఎవరికుంటుంది? ఆయన ఏ పనిచేసినా అందు ఆధ్యాత్మిక భావనాదృష్టి కూడుకునే ఉండేది. చక్కని సమాజం నెలకొనాలంటే చక్కని విద్యగరపాలన్న ధ్యేయం ప్రధానంగా ఉండేది.

ఏ పనిచేసినా, ఏ బోధనకు సంకల్పించినా, ఓ మంచి పత్రిక ఉండాలి. ఆ భావనతోనే 'శ్రీవాణి' పత్రికను స్థాపించారు. శ్రేయోమూర్తులు కొందరు పత్రికా నిర్వహణ భారంతో కూడుకున్నదని, చేతులు కాల్చుకోవద్దని చెప్పినా కూడా వారు వెనుకంజ వేయలేదు. ధర్మబోధకమైన పత్రిక అవసరమని గుర్తించారు. 'శ్రీవాణి' పత్రికను ప్రారంభించారు. 1985 సం॥ములో ఆయన స్థాపించిన 'శ్రీవాణి' సత్యసాయి వాణినీ, దేశభక్తినీ, త్యాగశీలతనూ, సంగీత, సాహిత్యానురాగుల్ను గురించీ వివరిస్తున్న పత్రిక. ఇలాంటి పత్రికలు నడిపేవారికి ప్రభుత్వం నుంచిగానీ, ప్రజల నుంచిగానీ అడ్వర్టయిజ్‌మెంట్లు రావు. చేతులు కాలుతూనే ఉంటాయ్. కారణ జన్ములైన వారు వాటిని లక్ష్యపెట్టరు. అందుకే ఆయన కారణజన్ముడంటున్నాం. కర్మజీవి అంటున్నాం. ధన్యమూర్తి అంటున్నాం.

సత్యసాయిబాబా భగవానుని దర్శించినపుడు 'కృష్ణమోహనరావూ నీవు నన్నిప్పుడే చూస్తున్నావు. నీవు నాకెప్పుడో తెలుసు. స్వార్థరహితమూ, ప్రేమపూరితమైన సేవచేస్తున్నావు. నీ సేవా జీవితమును చూచి నిన్ను అనుగ్రహించాను' అంటూ ఆయన ఆశీర్వదించారు. 2009 సం॥ము ఆగస్టు 12న కొమరగిరి మరణించిన తరువాత కూడా 'శ్రీవాణి' దిగ్విజయంగా నడుస్తుందంటే బాబా ఆశీస్సులే కారణం.


ఇందిరాగాంధీ ఎమర్జన్సీ సందర్భములో ప్రభుత్వ వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నందుకు ఆయనకు 19 నెలల కారాగార శిక్షను విధించి, రాజమండ్రి జైలులో ఉంచారు. అయినా ఆయన కుంగలేదు. భీతి చెందలేదు. పలుమంది తోటి ఖైదీలు ఏవేవో కారణాలు చెప్పి బయటకు వచ్చారు. సత్యం పలికే ఆయన నాలుక అసత్యం పలుకలేకపోవడమే కారణంగా ఆయన జైలులోనే ఉండిపోయారు.

కొమరగిరి కృష్ణమోహనరావు వంటి సత్యశీలురూ, కర్మ, జ్ఞానమూర్తులనూ చూడలేకపోవడం దురదృష్టకరం. కనీసం కొంతగానైనా వారి బాటలో నడుద్దాం. ●

## అంత పలచగా ఉన్న దర్శకుడెవరో కాదు; దాసరినారాయణరావు!

## అంత సాదాసీదాగా ఉన్న నటుడెవరో కాదు; య(స్)శ్వసి. రంగారావు!

## వీరిరువురుకి మొదటి కలయిక చిత్రం 200 రోజులు నడచిన చిత్రం ఇదే! ఇదే!




దాసరి నారాయణరావు మా పాలకొల్లువాడు. నేను చదువు కున్న ఎం.ఎం.కె.ఎన్. మునిసిపల్ హైస్కూలులోనే చదువు కున్నాడు. అయితే దాసరిని స్కూలులో కలసి మాట్లాడుకో లేకపోవడానికి కారణం – నేను స్కూలు చదువు పూర్తిచేసిన తరువాత దాసరి స్కూల్లో చేరాడు.

ఆయన మద్రాసు వచ్చి ఫల్గుణా పిక్చర్సు కథా భాగం లోనూ, నా మిత్రుడు, దర్శకుడైన కె.వి. నందనరావుకు సహ దర్శకునిగా పనిచేస్తున్నప్పుడే పరిచయం చేసుకున్నాను. ఆయనలో కష్టపడే శక్తి అపారంగా ఉండేది. నిర్మాత కె. రాఘవ ప్రొడక్షను మేనేజరు, ప్రొడక్షను ఇన్‌ఛార్జిగా ఉన్నప్పటి నుంచీ తెలుసు. ఏకామ్రేశ్వరరావుతో కలిసి రాఘవ నిర్మాతగా మారిందీ తెలుసు. కొన్నాళ్లకు నిర్మాత లిద్దరూ విడిపోయిన తరువాత – రాఘవ స్వంతంగా నిర్మాణ సంస్థ నేర్పరచుకుని 'తాతా– మనవడు' చిత్రాన్ని నిర్మించతలపెట్టడం– దాసరి నారాయణరావుకు తొలి దర్శకత్వ అవకాశం కల్పించడమూ తెలుసు.

రాఘవ పట్టుదల కలవాడు. అన్నమాటపై నిలబడేవాడు. దురుసుతనం మాటల్లో కనిపించినా మంచి మనసు కలవాడు. అలాంటి నిర్మాత యింతవరకూ పుట్టలేదు. అందుకేనేమో శతంజీవిగా నూరు సంవత్సరాలూ బ్రతుకుతున్నాడు. దాసరి నారాయణరావు చెప్పిన కథ రాఘవకూ నచ్చింది, మరో ముఖ్యపాత్రను ధరించే నట యశస్వి ఎస్వీ రంగారావుకూ నచ్చింది. రాజ్‌బాబు ఆ చిత్రంలోని కథానాయకుడు. పాత్రలకందరూ తీర్చిదిద్దబడినట్లు ఎన్నికయ్యారు. సినిమారంగంలో ఉన్న అలవాటు పొరపాటు కారణంగా రాఘవ చిత్రాలను పంపిణీ చేసే పంపిణీ దారులకు కథ చెబితే వారూ 'ఓకే' చెప్పారు. కానీ దాసరినారాయణరావు గాకుండా కె.యస్. ప్రకాశరావుని దర్శకునిగా నియమించమన్నారు. రాఘవ మాట నిఖార్సు గల వ్యక్తియైనందున డిస్ట్రిబ్యూటర్లనైనా వదలుకుంటాను గానీ దర్శకుడిగా దాసరినారాయణరావుని మార్చటానికి అంగీకరించనని తెగేసి చెప్పాడు. అలాటి 'ధీశక్తి' కలవాడు రాఘవయైనందుననే దాసరినారాయణరావు దర్శకుడయ్యే అవకాశం కల్గింది. దర్శకునిగా, మాటల రచయితగా తన సత్తాను నిరూపించుకుంటూ తొలిచిత్రం ద్విశతదినోత్సవ చిత్రంగా తీర్చిదిద్దకలవాడనిపించుకున్నాడు. అత్యల్ప కాలంలోనే 150చిత్రాలకు దర్శకత్వం నెరపే శక్తిమంతుడు కాగలిగాడు. ఈ విభవం గిన్నీసు రికార్డుల్లోకి యెక్కవలసింది. వారు రిజిస్టరు చేసారో లేదో నాకు తెలియదు.

చిత్రసీమలో ఏ దర్శకుని జన్మదినోత్సవానికీ– క్యూలో నిలుచుని, బుకేలూ, దండలూ, శాలువలూ, బహుమతులూ యిచ్చిన వైనం లేదు. దాసరినారాయణరావు ఒక్కనికే దక్కింది. నా 'సినీరమ' పత్రిక యిలాంటి విషయాలనెన్నిటినో పేర్కొంది.

కథకూ, మాటలకూ ఉన్న శక్తిని సెల్యులాయిడ్‌పై చూపించగలిగిన శక్తి మంతుడు దాసరినారాయణరావు మా పాలకొల్లువాడు కావడం నాకు గర్వించదగిన విశేషం!

కె. రాఘవ తొలిచిత్రనిర్మాతగా తానేవిటో, నిర్మాత ఎంత శక్తిమంతుడుగా ఉండాలో తెలియచేసాడు. దర్శకత్వంలో దాసరినారాయణరావు తొలిమెట్టు నధిరోహిస్తున్నాడని చూడకుండా, గ్లామర్‌లేని ఓ తాతపాత్రలో విశ్వనట సామ్రాట్ యస్వీ రంగారావు నటించడం మరో గొప్ప విశేషం. కామెడీ పాత్రలను వేస్తున్న రాజ్‌బాబును హీరోగానూ, విజయనిర్మలను హీరోయిన్‌గానూ, గుమ్మడి వెంకటేశ్వర రావును మరో విశిష్టమైన పాత్రకు యెన్నుకోవడంలో కూడా దర్శకుడు దాసరినారాయణరావు, నిర్మాత రాఘవనూ బహుముఖంగా అభినందించాలి.

మా పాలకొల్లు కళానిలయం. ఎందరో కళామూర్తులు మద్రాసు సినిమా రంగంలో కాలూనారు. వీరిలో కోడిరామకృష్ణ, రేలంగి నరసింహారావు ప్రభృతులు వారి దర్శకసామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. మా అన్నయ్య గారిచే చేతిబెత్తం దెబ్బలు తిని చదువుకున్న చలం (కోరాడ సింహాచలం) హీరోయై, రమణ చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి, అనేక మంచి చిత్రాలను నిర్మించారు. పినిశెట్టి శ్రీరామమూర్తి తన 'పల్లెపడుచు' నాటక ప్రభావంతో సినిమా రంగంలో అడుగిడి యెన్నో చిత్రాలకు కథ, మాటలు అందించటమే గాకుండా 'నిత్యకళ్యాణం పచ్చతోరణం' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. మల్లాది సత్యనారాయణ కొన్ని చిత్రాలకు సంభాషణలూ వ్రాసారు. మంచి మంచి పాత్రలనూ ధరించారు. ఇహనటులుగా వచ్చిన వాళ్ళల్లో కోళ్ళ సత్యం వంటివారూ, నిర్మాతలుగా ముచ్చెర్ల రామదాసు వంటివారూ ఉన్నారు.

రచనా– దర్శకత్వంలో విశేష కృషీ, అనంత ప్రాభవమూ సంపాదించినవాడు ఒక్క దాసరినారాయణరావేనని ముద్రగుద్దినట్టు చెప్పాలి. ఆయన పాలకొల్లువారి నెందర్నో ఆదరించారు. చలనచిత్రకవి, దర్శకునిగానే కాకుండా 'ఉదయం' పత్రికను స్థాపించి 'ఈనాడు' పత్రికకు పెద్దపోటీనిచ్చారు. దర్శకునిగా చాలామంది పత్రికారచయితలకూ, ప్రతిభావంతులకూ బంగారు పతకాలనూ బహూకరించారు. అయితే వీటన్నిటిలోనూ మినహాయింపబడినవాణ్ణి నేనొక్కడినే! (ఎందుకు మినహా యింపబడ్డానన్నది దాసరికే తెలియాలి). అందుకు కారణంగా దాసరి నారాయణ రావుపై అమితంగా ఉన్న అభిమానం పోదు. స్వంతూరునూ, స్వంత ఊరివారినీ గౌరవించుకోవలసిన మనః తపన నా రక్తంలో ప్రవహిస్తూంటుంది.


గాకపోయినా, దాసరినారాయణరావు దర్శకశిఖరాన్ని అధిగమించిన వారొక్కరూ ఉండరన్నదే నా ప్రగాఢ నమ్మకం. **(తరువాయి 12వ పేజీలో)**

**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**
**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***



# మంత్రాలయం రాఘవేంద్ర బృందావనం పూర్వపు పీఠాధీశులు
# గురు శ్రీ సుశమీంద్ర తీర్థులు!

నేనొక పర్యాయం మంత్రాలయం వెళ్ళి రాఘవేంద్ర బృందావనం దర్శించుకుని అప్పటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సుశమీంద్ర తీర్థులవారిని దర్శించాను. అప్పుడే ఆయన భిక్షగైకొని ఆసనంపై కూర్చోనున్నారు. వారి ఆప్తకార్యదర్శి నన్ను పూజ్యశ్రీ స్వామివారికి పరిచయం చేసారు. వారితో మాట్లాడడానికి నాకు కన్నడం రాదు. పూజ్యపాదులకు తెలుగు రాదు. ఆప్తకార్యదర్శి నన్ను చెప్పడానికి ముందే అక్కడున్నవారికి కన్నడంలో చెప్పారు. మామూలుగా పీఠాధీశులొసగే వస్త్రము గాకుండా, ఓ మణుగు బరువు ఉండే కాషాయ వస్త్రము– 8 మూరల నిడివికలిగి, చక్కని రెండు వెండి జల్తారు పట్టు అంచుగల పంచెను నాకు యిస్తూ, ఒడిపట్టమని, రాఘవేంద్ర అక్షితలు యిస్తూ, ప్రయాణం చక్కగా సాగగలదని కన్నడంలో చెప్పారు. ఎక్కడలేని ఆనందమూ నాలోని ఆపాద మస్తకమూ వ్యాపించింది. నేను మంత్రినీగానూ, విఐపిగానీ, భూరివిరాళమిచ్చినవాణ్ణి కాను. అంతకు పూర్వం వారిని చూడలేదు. వారికా తలంపును గురు రాఘవేంద్రుడే కల్గించాడేమో!

గురు సుశమీంద్రులు సర్వసాధారణ పీఠాధీశుల కానేకాదు. బెంగుళూరులో ఓ పత్రికా విలేఖరి ఫోటో తీసినపుడు ఆయన హృదయమ్మీద శ్రీ నరసింహస్వామి కనిపించారు. దీనిని బట్టి గురు శ్రీశ్రీశ్రీ సుశమీంద్రతీర్థులెంతటి తపః సంపన్నులో విదితం గాకుండా ఉండదు.

(11వ పేజీ తరువాయి) ఇహ యశస్వీ రంగారావు, నమ్మినవాళ్ళకు, ప్రేమించిన వాళ్ళకూ, తన హృదయపీఠంలో యెంతటి స్థానమిస్తాడో– ఎవరూ ఎరుగని విషయం. అతడన్ని సమయాలలోనూ మద్యంమత్తులో ఉన్నాడంటారు. కానీ మాధ్యమప్రియుడని చాలామందికి తెలియదు. నాయింటిలో సత్యనారాయణ వ్రతానికి వచ్చి, ఆతిథ్యం స్వీకరించివెళ్ళాడు. తన స్వంతచిత్రానికి PROగా నియమించాడు. హీరోలు ఎందరు ఉన్నా– 'నర్తనశాల' చిత్రంలోని కీచకపాత్రే విదేశాల్లో కీర్తిపతాకాన్ని ఎగురవేసింది. కీచకుడు, ఘటోత్కచుడు, రావణాసురుడు, దుర్యోధనుడు వంటి పాత్రలను వేసినప్పటికినీ 'బంగారుపాప', 'బాంధవ్యాలు', కృష్ణ నిర్మించిన 'పండంటి కాపురం' వంటి చిత్రాల్లో తండ్రి పాత్రను చక్కగా నటించాడు. గుండమ్మ కథ, పెళ్లిచేసిచూడు వంటి చిత్రాల్లో హాస్యరసాన్ని అమోఘంగా కురిపింపచేసాడు. తమిళచిత్రాల్లో పక్షవాత రోగిగా తన నట పస ఏదో తెలియచేసాడు. కానీ ఆయన స్థానాన్ని పొందే నటుడు రాలేదు. ఆయన పాత్రల ననుకరించే ప్రయత్నం నటుడు సత్యనారాయణ చేసాడు.

రంగారావు ననుకరించిన నటులున్నారుగానీ–దాసరినారాయణరావు ననుకరించిన దర్శకులు ఇప్పటివరకూ రాలేదు. అయితే దాసరినారాయణరావు ఎదుగుదలలో ఆయన సతీమణి దాసరి పద్మ భాగమెంతో వున్నది. దాసరి పద్మ పోవడంతో నారాయణరావు కొంతక్రుంగిపోయాడు. అతడి నిత్యనైసర్గిక పనుల్లో వాడి నటించి నట్లే, ఆయనలోని వీరత్వం కొంతగా సడలింది. కానీ హైదరాబాదు ఫిలిమ్ ఇండస్ట్రీలో ఆయన పెద్దరికం పరిఢవిల్లుతూనే ఉన్నది. ఏదైనా సమస్య ఏతెంచినపడు దాసరినే పిలుస్తారు. ఆయనకు ఆంధ్రా, తెలంగాణా అనే సమస్యేలేదు. అందరికీ పెద్దాయన.

తిరుపతి కేంద్రంగా 'ఉదయం' పత్రికను ప్రారంభింపచేసారు. తిరుపతిలో సినిమా స్టూడియో నిర్మిద్దామని స్థలం కూడా తీసుకున్నారు. తన చిత్రంలోని కొన్ని సన్నివేశాలు అక్కడే తీసినట్లు జ్ఞాపకం. ఆయనకూ పత్రికా రచయితలంతే ఎనలేని అభిమానం. ఆయన తీసే ప్రతి చిత్రనిర్మాణంలోనూ పత్రికా రచ యితల్ని పిలిచేవారు. తనూ ఒక పత్రికా రచయితనంటూ సంబర పడేవాడు. 'ఎం.ఎల్.ఏ. ఏడుకొండలు' చిత్రానికి పత్రికా రచయితల గోష్ఠి ఏర్పాటు చేసారు. వారి చిత్రం అవుట్ డోర్స్‌కు పత్రికా రచయితల్ని తీసుకునివెళ్ళేవారు. 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' 'శివరంజని' చిత్రాల సందర్భములో తూర్పుగోదావరి జిల్లాకు వెళ్ళాను. దాసరి అగ్రశ్రేణి తారల సినిమాలకూ దర్శకత్వం చేసారు. కొత్త తారలతోనూ చిత్రాలు తీసారు. అలాపైకివచ్చినవారే మోహన్‌బాబు, నారాయణ మూర్తి. హాస్యం పండించడంలోనూ హాస్య పాత్రల్లో నటించడంలోనూ దాసరికి దాసరే సరి.


దాసరి తొలిచిత్రం 'తాతామనవడు' ప్రీమియంషో' సౌత్ ఇండియన్ ఫిలిమ్ ఛాంబర్‌లో ప్రదర్శించినపుడు ఆయన పొందిన అనుభూతిని, చప్పట్లు కొట్టి అభినందించిన అనుభవం దాసరి మాటల్లోనే పొందుపరుస్తున్నాను:

సినిమా తొలి కాపీ వచ్చాక అప్పటి ఆచారం ప్రకారం మొదటి ప్రొజెక్షన్ మద్రాసులోని ఫిలిమ్‌ఛాంబర్‌లో వేశారు. మధ్యాహ్నం మూడు గంటలకి షో పెట్టాం. చాలామంది వచ్చారు. అదివరకే నిర్మాతతో కలిసి చూసుకున్న నేను తృప్తిగా ఉన్నప్పటికీ మనసులో భయంభయంగాను ఉంది. వాళ్లెలా స్పందిస్తారోనని. సినిమాను అందరూ ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తూనే ఉంది. 'సోమ మంగళ బుధ' పాటని చిత్రీకరించిన విధం చూసి అందరూ చప్పట్లు కొట్టేశారు. ఆనందంతో నా వళ్ళు ఒక్కసారి గగుర్పొడిచింది. అలాగే రంగారావు కొడుకు తన వద్దకు పంపిన మనుషులతో 'ఎంతమంది వచ్చారు బాబూ' అంటాడు. 'మేం నలుగురం వచ్చామండయ్యా' అంటారు. అప్పుడు రంగారావు 'అవును చనిపోయాక మోసు కెళ్ళడానికి నలుగురు కావాలి. అందుకే బతికున్నప్పుడు నలుగురితో మంచిగా ఉండు అంటారేమో' అని చెబుతారు. దానికి ట్రెమండస్ రెస్పాన్స్. సినిమా అయ్యాక కె.యస్. ప్రకాశరావు నన్ను కౌగలించుకున్నారు. కృష్ణగారు ఒక్కసారిగా లేచి 'ఈ సినిమా 200 డేస్ ఆడుతుంది' అన్నారు. ●






# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

89

## పదునైదవ అధ్యాయము - పురుషోత్తమప్రాప్తియోగము

**15.** సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతిర్జ్ఞా న మపోహనం చ
వైదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాన్తకకృద్వేదవిదేవ చాహమ్.

**వ్యాఖ్య:–** 'సర్వస్య' – జాతిమతకులతారతమ్య మెద్దియులేక చరాచరప్రాణికోట్ల యందు భగవానుడు నివసించుచున్నాడని చెప్పబడుటవలన ఇక నెవరును అధైర్యపడ వలసిన పనిలేదు. మహాపాపియైనను చెండాలుడైనను తనయందలి దైవసన్నిధిని స్మరించి పవిత్రాచరణ ద్వారా వారిని తెలిసికొనవచ్చును. అట్టి పాపియు తన వెనుకనున్న, తనకు ఆధారముగనున్న అఖండ చైతన్యమును స్మృతి యందుంచు కొనినచో తన నిజరూపమును చింతించినచో పుణ్యాత్ముడే అయి తరించును.

ఇట్టి అవకాశమును శ్రీకృష్ణపరమాత్మ గీతయందు సర్వులకును కల్పించి యున్నారు. ఎటువంటివారికైనను తరించుటకు చక్కని అవకాశము నొసంగి యున్నారు. తరంగము చిన్నదైనను, పెద్దదైనను రెండిటివెనుక మహాసముద్రమే కలదు. కాబట్టి చిన్న తరంగము (ప్రాణి) అధైర్యమొందవలసిన పనిలేదు. తనయందలి అంతర్యామియగు పరమాత్మను తెలిసికొనిన చాలును. ఆ పరమాత్మ అందఱి యొక్కయు 'జన్మహక్కు' అని గీతాచార్యులు 'సర్వస్య' అను పదము ద్వారా భేరి మ్రోగించి చెప్పుచున్నారు.

'హృది' (హృదయమునందు) – అని పేర్కొనుటవలన, భగవానుడు ప్రతివానికిని అతిసమీపమున హృదయమందే వర్తించుచున్నారని భావము. కావున శిక్షకుడు చెంతనే యున్నారని గ్రహించి, పాపకృత్యములను చేయక, భగవత్ప్రీతికరములైన కార్యములనే (ధర్మకార్యములనే) చేయవలెను.

'మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనం చ' – స్మృతి, జ్ఞానము, మఱపు– ఇవి యన్నియు మనస్సుయొక్క వివిధ రూపములు. పరమాత్మయే మనస్సునకు అధిష్ఠానముగ, ఆధారభూతుడగ నున్నవారు. కావున వారివలననే యవి కలుగుచున్నవని చెప్పబడి నది. దీనిని బట్టి కేవలము స్థూలవస్తువులనేకాక, అతిసూక్ష్మములగు జీవుని మానసిక ప్రవృత్తులను కూడా భగవానుడు గమనించుచున్నట్లునే, వారికి తెలియకుండా ఏదియు మనస్సునందు జరుగదనియు స్పష్టమగుచున్నది. కాబట్టి ప్రతివారును తమ మనస్సునం దేలాటి అపవిత్రత, మాలిన్యము, దుస్సంకల్పములు, విషయవాసనలు రానీయకుండ భద్రముగా చూచుచుండవలెను.

'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః'– వేదములందు, శాస్త్రములందు అనేక దేవుళ్ళు, దేవతలు చెప్పబడినప్పటికిని, తెలిసికొనదగినవాడు ఆ పరమాత్మ ఒకడే అయి యున్నారు. బ్రహ్మవిష్ణుమహేశ్వరాది వివిధదేవులందఱును ఒక్క పరమాత్మ యొక్కయే వివిధరూపులైయున్నారు. ప్రపంచమును ఒకే చరమలక్ష్యము, ధ్యేయము, జ్ఞేయము కలదు. అది సచ్చిదానందపరబ్రహ్మమే (పరమాత్మయే) యగును.

'వేదాన్తకృత్'– వేదములన్నిటిని సృష్టించినది సాక్షాత్ పరమాత్మయేకాని మానవ మాత్రుడు కాదని యిట స్పష్టమగు తెలుపబడుటవలన, ఆ వేదాదులందు తెలుప బడిన సత్యములందు (ఇవి భగవత్ప్రోక్తములే' అను) నమ్మకము గలిగి ప్రవర్తింప వలయును. అవి దైవనిర్మితములగుటచే వానియందఖండ విశ్వాసముంచవలెను. లోకమున గురుపరంపర చెప్పునపుడును 'ఓమ్ నారాయణం పద్మభువం..." అని మొట్టమొదట ఆ పరమాత్మనే, శ్రీమన్నారాయణునే పేర్కొనుచుందురు.

**16.** ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ
క్షరస్సర్వాణి భూతాని కూటస్థోక్షర ఉచ్యతే

**వ్యాఖ్య:–** క్షరపురుషుడు, అక్షరపురుషుడు, పురుషోత్తముడు– అను ముగ్గురు పురుష లను గూర్చి చెప్పబోవుచు మొట్టమొదట క్షరాక్షరులను గూర్చి భగవానుడీ శ్లోకము నందు తెలియజేయుచున్నాడు. నశించునట్టి దేహాదిదృశ్యపదార్థములన్నియు అనగా చరాచరజీవుల యొక్క ఉపాదులన్నియు తాము అని అభిమానించువారు క్షరపురుష లనియు, ఆత్మచైతన్యము యొక్క ప్రతిబింబరూపులగు జీవులు (మనస్సులు తాము అని అభిమానిఅంచువారు) అక్షరపురుషులనియు ఇచట చెప్పబడిరి. క్షరమైన దేహములతో పోల్చిచూచినచో మోక్షపర్యంతము అనేక జన్మలకాలము వఱకు నశింపకుండ ఉండువాడగుటచే జీవుడు అక్షరుడనియు, కూటస్థుడనియు చెప్ప బడెను. అయితే ఈ అక్షరుడు 8వ అధ్యాయమందు తెలుపబడిన అక్షరపరబ్రహ్మ మనిగాని, కూటస్థుడనగా కూటస్థ చిదాత్మయనిగాని యెవరును తలంచరాదు. ఏలయనని వారిరువురికిని 'ఆకాశపాతాళ' బేధముకలదు. ఒకడు బింబము; మఱి యొకడు ప్రతిబింబము. ఈ అధ్యాయమందు తెలుపబడిన అక్షరుడు ప్రతిబింబము– అనగా జీవుడు. ఈ క్షరాక్షరుల యిరువురి కంటెను వేఱైనట్టి, అనగా ఉపాధి అభిమానికంటెను, చిత్ప్రతిబింబమగు జీవుని (మనస్సుయొక్క అభిమాని) కంటెను వేఱుగానున్నట్టి ఉత్తమపురుషుని గూర్చి రాబోవు శ్లోకమును చెప్పబడును. ఆతడే పరమాత్మ.

*(తరువాయి వచ్చే సంచికలో)*

వశీకరణ కవచం
ధర రూ. 1000/- మాత్రమే
Vasikarna Kavacham

ఇంట్లో పిల్లలు మీ మాట వినడంలేదు. మాటకు మాట సమాధానం ఇస్తున్నారు. తల్లితండ్రులంటే భయభక్తులు వుండటంలేదు. ఏం చేయాలి? భార్య భర్తమాట వినదు. భర్త భార్య మాట వినడు.. ఏం చేయాలి? ప్రేమికుల్లో ఒకరిమాటకు మరొకరు విలువ ఇవ్వడంలేదు.. ఏంచేయాలి? ఆఫీసులో మీ పై అధికారి మీ సహనాన్ని పరీక్షిస్తున్నారు. వారి మెప్పు పొందాలంటే ఏం చేయాలి. డబ్బు తీసుకున్న బాకీదార్లు అనుకున్న సమయానికి తిరిగి చెల్లించడం లేదు.. ఏం చేయాలి? విద్యార్థులకు చదివినది గుర్తుండటంలేదు.. ఏం చేయాలి? అవివాహితులకు వివాహయోగం త్వరగా కలగటంలేదు.. ఏం చేయాలి? వీటన్నిటికీ ఒకే సమాధానం వశీకరణ కవచ ధారణ. డా. చల్లా జయదేవానంద శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

:09840259871, 04424837505
BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra